# "కాఫీ" : యుద్ధాలు |

"కాఫీ యుద్ధాలని" జరిగేవి మా ఇంట్లో – చద్దెన్నాలను తెచ్చి కాఫీకి పోటీపెట్టేవారు. కొంపలోకి కాఫీని ప్రవేశ పెట్టడం అంటే అంటు వ్యాధినో మహమ్మారినో ప్రవేశపెట్టినట్లు, కొంప గుండవై పోతుందని పెద్దవాళ్ళు లబలబలాడి పోయేవారు. ఇంగ్లీషు చదువులూ, క్రాఫింగులూ ముందూ, కాఫీలు కొంచెం వెనుకా కొంపల్లో ప్రవేశించాయి. అశుభ ప్రాప్తమ్మగు కలియుగంబు కాఫీతో పాదమ్మిడియెన్ అని మా వాళ్ళంతా నమ్మతూండేవారు. ఇప్పుడు సోషలిజాన్ని ప్రవేశపెడతామని కాంగ్రెసు వారు సరదాకి నోరు జారగానే ముసలి పులులు కంగారు పడినట్లుగా, బ్యాంకులను జాతీయం చేయటం సమస్య కంటె చిక్కు సమస్య అయి పోయింది కాఫీ ప్రవేశం ఆరోజుల్లో.

మాకు కొంత మంది ఇంగ్లీషు చుట్టాలు వచ్చినపుడల్లా ఎవరి కాఫీపొడి వారే తెచ్చుకునేవారు. కాని అప్పుడప్పుడు బిళ్ళల కాఫీ త్రాగాలిసొచ్చి నప్పటికీ కాఫీ వాదులకూ నాన్ కాఫీ వాదులకూ ఎక్కడా సయోధ్య కుదిరేదికాదు. మా వాళ్ళు కాఫీ కుంపటి అని ఓ కుంపటిని యివతల తగలేసేవారు. ఆ కాఫీ వడపోసిన గుడ్డ వాసనకే మురిసి పోయిన పనిమనిషి కాఫీ గ్లాసుల్నీ, కాఫీ గిన్నెల్నీ అవలీలగా కడిగేసేది. ఇప్పటికి అంట గిన్నెల్ను తోమడం కంటె కాఫీ గ్లాసుల్నీ తోమటం సింపుల్ ట్రిక్‌గా, చాలా ఎలిమెంటరీ విషయంగా గృహరాణులు భావి స్తున్నారు. పిల్లలకి కాఫీ పట్టటం చాలా అవుట్ రేజియస్ యాక్టుగా థింక్ చేయబడేది.

మొగుడి సంతోషం కోసం చాటునా మాటునా దొంగ తనంగా కాఫీ తాగే ఆడది మొగుడి సంతోషం కోసం బ్రాంది పుచ్చుకున్న ఆడదానిలా చూడబడేది. కాఫీ మరిగిన కాంతలకు పుట్టింటి నుంచి కాఫీ గుండా పంచదారా పాలకర్చుకు పాకెట్ మనీ (ఆడాళ్ళకు పాకెట్లుండవు ఖర్మ-జాకెట్ మనీ అనాచ్చో అనకూడదో....) రహస్యాతి రహస్యంగా అంచెలమీద వచ్చి చేరుతూండేది. పడగ్గదిలో మంచం క్రిందనే చిన్న కుంపటి వెలిగించి కాఫీ సంసారం సాగించే వొదిన్లని నేను ఎంతమందినో ఎరుగుదును. చద్దెన్నంతినే అన్నయ్యలు క్రమేపీ కాఫీ మతం పుచ్చుకుని మతాంతరులు కావటం, కొంపలో రాద్ధాంత సిద్ధాంతాలు జరగటం, కాఫీ కుంపట్లు— కుంపట్లు చిన్నవే అయినా, తెలంగాణా సమస్యలా తయారవటం ఆరోజుల్నుంచీ వుంది. ఒకవేళ మా వదినలు పొరపాటున మాచేత ఒక అవున్సు అరవున్సు కాఫీతాగించినా అది మాకు యివిడేది కాదు. ఇంత డోకొచ్చే పదార్థాన్ని ఎలా పుచ్చుకుంటారని బుగ్గలు నొక్కుకునేవారు.

అన్నయ్యలూ, వొదిన్లూ, అక్కయ్యలూ బావలూ కాఫీ ముద్దులని పెట్టుకునే వారనుకుంటాను, ఈ కాఫీ ముద్దులవలన స్త్రీ పురుషులకు ఒకరి నుంచి ఒకరికి కాఫీ అలవాటు వ్యాపించి వుండవచ్చునని నా ఊహ సుమండీ. పిప్పరమెంట్లు చాక్లెట్లు తినే పిల్లల్ని ముద్దెట్టుకుంటే తీయగా హాయిగా వున్నట్లు (ఒళ్ళంతా బంక చేసుకుని జీడికారిపోయే పిల్లల సంగతి కాదు నేను చెప్పేది. వాళ్ళా ముద్దొస్తారు. కాని ముద్దుపెట్టుకోకూడదు) కాఫీ తాగగానే ఒక ముద్దు కొసరుగా వేసుకుంటే ఆ రోజుకి లైఫ్ ఫ్రెష్‌గా తాజాగా నవనవలాడిపోతూన్నట్లు వుంటుంది. పెద్దవాళ్ళు కాఫీ అంటు అని మల్లె అంటు, మామిడి అంటులాగ ఒక అంటుని లేవదీసి దానికి కొన్ని రూల్సుని బ్రహ్మసూత్రాల్లాగ తయారు చేశారు. కాఫీ డబ్బా యితర డబ్బాలకు తగలకూడదు. కాఫీ డబ్బా ముట్టుకున్నచేత్తో యింకేది ముట్టుకున్నా కొంప మునిగిపోయినట్లే.

నేను చిన్నప్పుడు అల్‌యంగ్ గరల్స్‌లాగే ఆవకాయ గోంగూర వగైరాల్తో చద్దెన్నం లాగించేసేదాన్ని. పెళ్ళయాక కాపరానికొచ్చాక కూడా చద్దెన్నంతిని కాఫీ తాగటంకాని, కాఫీత్రాగి చద్దెన్నం తినటంకాని చేస్తూండేదాన్ని, పిల్లలు పుట్టుకొచ్చాక పిల్లల్తో కలిసి చద్దెన్నం తినటం బావోదని చద్దెన్నం చాప్టర్‌కి ఫులిస్టాపు పెట్టా. మనవారు చద్దెన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరగదని అన్నారు. తిన్నా తినకపోయినా ప్రతి ఆడదీ మొగుడి ఆకలి ఎరిగుండాలని నేను నమ్ముతున్నాను.

అందిన మేరకు ఆడాళ్ళు చిరుతిళ్ళు సేవిస్తూంటారు. అలాగే మగాడు బయట మేసొస్తాడు. అనాది కాలం నుంచి మగాడు బయట మేసి వస్తున్నాడు. హోటళ్ళను మరిగిన మగాళ్ళకు పెళ్ళాల అభిరుచులు తెలియవని యిపుడిపు డంటున్నారనుకోండి! ఆకలి అనేది ఎటువంటి దయినా అది పరమ డేంజరస్. అంచాత కడుపునింపిన వారు చెప్పే కమ్మటి కబుర్లను వినకూడదు. ఒకవేళ వింటే ఆలోచించాలిసుంటుంది. ఆలోచించాలంటే కాఫీ తాగాలి. ఆకలి తీరాలంటే చద్దెన్నం తినాలి. డబల్ బుల్లక్ కార్ట్ అనగా రెండెడ్ల బండిని రిప్లేస్ చేసే సరుకేదీ మన కంట్రీలో లేనట్లే, చద్దెన్నాన్ని రిప్లేస్‌చేయగల పవర్‌ఫుల్ టిఫిను యింత వరకూ కనిపెట్టబడలేదు. చద్దెన్నం తినకపోతే లేచి తిరగటానికికూడా సత్తువ వుండేదికాదు.

మా యింట్లో కాఫీ యుద్ధాలు జరిగే రోజుల్లో మా మేనత్త మొగుడొకాయన వుండేవారు. ఆయన్ని కొందరు ఇంగ్లీషు మావయ్యనీ గ్రామరు మావయ్యగారనీ అంటూండేవారు. ఆయన గుమ్మంలో అడుగుపెడుతూనే పిల్లల్ని ఇంగ్లీషులోనో లెక్కల్లోనో ఎన్ని మార్కు లొచ్చాయని అడిగేవాడు. పనిలో పనిగా ఇంగ్లీషుగ్రామర్లో ప్రశ్నలడిగే వాడు. అలా అలా గ్రామర్లోంచి లెక్కల్లోకి దిగిపోయేవాడు. వాళ్ళ పిల్లల స్టాండర్డ్ చాలా హెచ్చు అనీ, మేవు జంగిలీలవనీ ఆయన యిట్టే తేల్చిపారేసేవాడు. ఆయన మళ్ళీ వాళ్ళవూరు వెళ్ళి పోయేదాకా మాకు

చెడ్డ యిబ్బందిగా వుండేది. పిల్లలంటే సరదాపడే వాళ్ళూ, పిల్లలను "డేంజరస్ గూడ్స్"గా చూసేవాళ్ళు అని చుట్టాలలో రెండు వైరైటీ లున్నాయి. మాకు కూడా కొంచెం కొంచెం తీర్థం యిచ్చినట్లు గొంతు కలో పోస్తూండటం వలన తిరిగి వెళ్ళిపోయే రోజున మా అందరి చేతుల్లో తలో బేడా పెట్టి గ్రామరు బాగా చదువుకోమని చెప్పటం వలన ఇంగ్లీషు మావయ్య అంటే కొంత యిష్టమూ, కొంత అయిష్టమూవున్నా ఆయన కొంపలో కాఫీ పీఠం బలపడటానికి మూల కారకుల్లో ఒకరుగా గుర్తుకొస్తాడు.

అడపా తడపా చుట్టాలు వచ్చి తొంగిచూసి పోతుంటేకాని ఇల్లు అనే పదార్థానికివున్న పరమార్థం చక్కగా బోధపడదు. ఇప్పుడిప్పుడు "చుట్టాన్ని చూడగానే" బస్సు టైములు రైళ్ళ రాకపోకలు కంఠతాపట్టి వప్పగిస్తున్నారు కాని, వెనకటి రోజుల్లో బంధువులెవరైనా వచ్చారంటే ప్రాణం లేచొచ్చేది. ఇరుకు కొంపలూ ఇబ్బందులూ, ఆర్థిక కారణాల వలన పట్నవాసాల్లో, యిపుడిపుడు పిలవని పేరంటంగా వచ్చిన చుట్టాలను వారివారి అంతస్తుల్ని బట్టి తెచ్చి పెట్టుకున్న మర్యాదల్తో ఆదరించడం జరుగుతోంది కాని, కారణాలేవైనా కృత్రిమ మర్యాదలు, మేలురకం చిరునవ్వులూ, ఆపేక్షలూ, అభిమానాలనూ అభినయించడం ఇవి శరీ రారోగ్యానికి అట్టే మంచివి కావు.

మా ఇంటి కెవరయినా చుట్టాలొస్తే వాళ్ళతో కాఫీ తాగొచ్చని నాకు చెడ్డ సరదాగా వుండేది. ఈ కాఫీ యుద్ధాలు చాలా పాత కాలం నాటివి. ఇప్పుడు మా ఊళ్ళో కాఫీ హోటళ్ళు సైతం వెలిశాయి. అందరి యిళ్ళలోనూ కాఫీ కుంపట్లు వెలుగుతుంటాయి. కాఫీ డబ్బులని కాఫీ కర్చులనీ దండుకోవడం అక్కడా మామూలయిపోయింది. ముస లమ్మలుకూడా "కొంచెం కాఫీ వుందే పిల్లా నీరసం వస్తోంది" అంటు న్నారు. తతిమ్మా వర్గాల ప్రజలుకూడా టీ చుక్కలకి కాఫీ చుక్కలకి తాపత్రయపడ్డం ఎక్కువైంది.

పాలు. పెరుగు, నెయ్యి యీ మూడిటిమీదా దెబ్బతీసినా "కాఫీ" సామాన్యుడి జీవితం సాఫీగా నడవకుండా ఎప్పుడూ అడ్డు తగుల్తూనే వుంటుంది. మన కుటుంబ జీవితాన్ని మన అలవాట్లను తారుమారు చేసి మన బడ్జెట్‌పై పెద్ద దెబ్బతీసిన "కాఫీ" ప్రవేశానికి ఎదురొడ్డి పోరాడిన అలనాటి కాఫీ విరోధుల్ని సంస్మరిస్తూ లేచి నిలబడి ఒక గుక్కెడు కాఫీ తాగుదాం!